## లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి : జడ్జి

మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్వర నాయక్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్
జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మదనపల్లె ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర నాయక్ తెలిపారు. శనివారం స్థానిక పోలీసులు, న్యాయవాదులతో ఏడిజె కోర్టు ఆవరణలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 14న నిర్వహించబోతున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. పోలీసులు, న్యాయవాదులు సమిష్టిగా సహకరించి రాజీ కాదగ్గ కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించాలని న్యాయమూర్తి తెలిపారు.

# అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

- మినీ కార్యకర్తలను ప్రధాన వర్కర్లుగా గుర్తించాలి
- కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాలో నాయకుల డిమాండ్

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్
అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు, మినీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ గత ప్రభుత్వం తమ యూనియన్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం అంగన్వాడీ వర్కర్ల జీతాలను, ఇతర అలవెన్సులను ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారినా ప్రభుత్వాలు చేసుకున్న ఒప్పందాలు మారవు అని అన్నారు. కష్టపడి పనిచేసే అంగన్వాడీలకు జీతాలు పెంచేందుకు డబ్బు లేదని చెబుతున్న అధికార పార్టీలో పెద్దలు మాత్రం నెలనెలా జీతాలు క్రమం తప్పకుండా తీసుకుంటున్నారని విమర్శించారు. పాలకులు తీసుకునే జీతాలతో పోలిస్తే, అంగన్వాడీ వర్కర్లకు ఇచ్చే జీతాలు అతి స్వల్పం అన్నారు. రాష్ట్రంలో ఒక పార్టీ పాలన పోయి, మరొక పార్టీ పాలన రావడం ముఖ్యం కాదని, పొరుగున ఉన్న శ్రీలంకలో వామపక్ష ప్రభుత్వం ఏర్పడిన విధంగా, మన రాష్ట్రంలో కూడా అటువంటి వామపక్ష ప్రభుత్వ పాలన వచ్చే విధంగా, అంగన్వాడీ వర్కర్లు, ఇతర సంఘాలలో ఉన్న వర్కర్లు ముందు కుటుంబాలలో, తర్వాత ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పటి నుంచి, పెరిగే వరకు అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, మిడ్ డే మీల్ వర్కర్లు చేస్తున్న శ్రమ ఎంతో ఎక్కువ ఉంటుందన్నారు. అలాంటి వారి పట్ల పాలకులు సానుభూతితో వ్యవహరించాలని హితవు పలికారు. పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, తమ డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీ వర్కర్లు చేసే పోరాటం అందరికీ తెలిసినదేనన్నారు. పోరాడితే తప్ప సమస్యలు పరిష్కారం కావన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రాజేశ్వరి మాట్లాడుతూ మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ వెంటనే జిఒ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 42 రోజుల సమ్మె కాలంలో చేసుకున్న ఒప్పందాలను జిఒలు, సర్క్యులర్లు విడుదల చేయాలని, వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు అవుతున్నప్పటికీ నేటికీ అంగన్వాడీలకు మేలు జరిగే ఒక్క పని కూడా చేయలేదని ఆరోపించారు. బడ్జెట్ సమావేశాల్లో కూడా అంగన్వాడీల గురించి ఒక ప్రస్తావన కూడా లేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకొని ఉన్న అంగన్వాడీలకు నిరాశ మిగిలిందన్నారు. అన్నిటికన్నా ముఖ్యంగా మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చే జిఒ కూడా ఇవ్వకపోవడం అత్యంత బాధాకరం అన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం జిఒ ఇవ్వాలని, తాము లేవనెత్తిన న్యాయమైన ప్రతి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందచేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన అంగన్వాడీల సమస్యల పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బంగారుపాప, ఓబుళమ్మ, ఈశ్వరమ్మ, భాగ్యలక్ష్మి, గౌరి, మధురవాణి, శ్రీవాణి, సుకుమారి, సిద్దమ్మ, సుభద్ర, ప్రమీల, అంగన్వాడీలు పాల్గొన్నారు.

రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసమే

# పాలస్తీనాపై ఇజ్రాయెల్ యుద్ధం

- సిటిజన్ ఫోరమ్ సదస్సులో ప్రముఖ పత్రికా సంపాదకులు ఎన్.వేణుగోపాల్

సదస్సులో మాట్లాడుతున్న ప్రధాన వక్త వేణుగోపాల్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి
ప్రపంచ రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసమే పాలస్తీనాలో ఇజ్రాయెల్ మారణహోమం సాగిస్తోందని వీక్షణం పత్రిక సంపాదకులు ఎన్.వేణుగోపాల్ పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ హాలులో సిటిజన్ ఫోరం అధ్యక్షులు రాజా వెంగల్‌రెడ్డి అధ్యక్షతన ప్రపంచ శాంతి వర్ధిల్లాలి, పాలస్తీనాపై దౌర్జన్యం నశించాలి, యుద్ధోన్మాదం అనే పేరుతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో 1948 ముందు ఇజ్రాయెల్ అనే దేశమే లేదన్నారు. రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం అమెరికా, బ్రిటన్, ఐక్యరాజ్య సమితి చేసిన కుట్ర ఫలితంగా ఇజ్రాయెల్ అనే దేశం ఏర్పడిందని తెలిపారు. పశ్చిమ సియాలోని పలు అరబ్బు దేశాల్లో చమురు నిల్వలు బయటపడడంతో నేపథ్యంలో ప్రపంచ ఆధిపత్య రాజకీయాల కోసం ఇజ్రాయెల్ అనే దేశాన్ని ఏర్పాటు చేశాయన్నారు. ఇజ్రాయెల్ దుందుడుకు, దుర్మార్గపు చర్యలతో పాలస్తీనాపై దాడులు చేస్తూ వెస్ట్‌బ్యాంక్, గాజా ప్రాంతాలకు పాలస్తీనా దేశాన్ని పరిమితం చేసిందని తెలిపారు. 55 శాతంగా ఉన్న ఇజ్రాయెల్ 85 శాతానికి పెంచుకుంటూ పోయిందని వివరించారు. పాలస్తీనా దేశాన్ని ప్రపంచంతో ఎటువంటి సంబంధాలు లేకుండా దిగ్బంధించిందన్నారు. ఫలితంగా ఆహారానికి, మందుల సరఫరా చేయకుండా నిరోధిస్తోందని తెలిపారు. ఇటువంటి దారుణాలకు పాల్పడుతున్న ఇజ్రాయెల్ దిగ్బంధన ప్రాంతాల నుంచి వెళ్లిపోవాలని ఐక్య రాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో పలుమార్లు తీర్మానాలు చేసినప్పటికీ పాటించడం లేదన్నారు. యాసర్ అరాఫత్ హయాంలో ఓస్లోలో ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ తూట్లు పొడిచిందని తెలిపారు. ప్రపంచంలో చాలా మంది యూదులు, అరబ్బులు సమస్యగా పరిగణిస్తూ మత యుద్ధంగా చూస్తున్నారని తెలిపారు. యూదుల మీద దాడి చేయడానికి ముస్లిములు చూస్తున్నారని, హింసావాదులని, మూర్ఖులని, అనాగరికులని, వారి మీద దాడి చేయాల్సిందేననే ఇస్లామోఫోబియా వ్యాప్తి చేస్తున్నారన్నారు. అమెరికా, బ్రిటన్‌లు పశ్చిమాసియా దేశాలలోని చమురు బావుల కోసమే ఇజ్రాయెలీలను పాలస్తీనాకు పక్కలో బల్లెంగా మార్చారని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు జి.చంద్రశేఖర్, గాలిచంద్ర మాట్లాడుతూ ఇజ్రాయెల్ దరహంకారాన్ని ప్రపంచం ఖండించాలన్నారు. ప్రపంచమంతా యుద్ధం ఆపాలని కోరుతున్నా ఆపక పోవడం వెనుక అమెరికా ఉందన్నారు. ప్రముఖ వైద్యులు సి.ఓబుల్‌రెడ్డి పశ్చిమాసియా వాతావరణమే ఇక్కడా కనిపిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అనంతరం జిల్లా పరిషత్ సమావేశ హాలు నుంచి కోటిరెడ్డి సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి క్యాండిల్ వెలిగించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఓబుల్‌రెడ్డి, బాబూభాయ్, సుల్తాన్, మెయినుద్దీన్, గుర్రప్ప, వరలక్ష్మి, డాక్టర్ వినోదిని, సునీత, పిళ్లా కుమారస్వామి, ఎల్ఐసి యూనియన్ నాయకులు రఘునాథరెడ్డి, సిఐటియు నాయకులు శ్రీనివాసులరెడ్డి, రామ్మోహన్, అన్వేష్, దస్తగిరిరెడ్డి, బాదుల్లా, డాక్టర్ ఎం.భాస్కర్ సహా పలువురు మేధావులు, అభ్యుదయవాదులు, ఇంటలెక్ష్చువల్స్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఇద్దరు పంచాయతీ ఇఒలపై సస్పెన్షన్ వేటు

పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

ప్రజాశక్తి-పీలేరు
పీలేరు మేజర్ గ్రామ పంచాయతీకి గతంలో ఇఒలుగా పనిచేసిన ఇద్దరిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ నెల 13న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. గత వైసిపి ప్రభుత్వంలో పీలేరు ఇఒలుగా పనిచేసి, ప్రస్తుతం చిత్తూరు జిల్లా సదుం మండల ఇఒపిఆర్‌డిగా పనిచేస్తున్న జిఎల్‌ఆర్‌వి.ప్రసాద్, అన్నమయ్య జిల్లా, కెవి పల్లె మండల ఇఒపిఆర్‌డిగా పనిచేస్తున్న ఎస్‌ఎ.గఫూర్‌లను సస్పెండ్ చేస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు అందే వరకు వారిద్దరూ విధులకు దూరంగా ఉండాలని ఆ ఉత్తర్వుల్లో కలెక్టర్లు పేర్కొన్నారు. పీలేరు గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగ అంశం, దానిపై పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి చేసిన పోరాటం ఫలించినట్లైంది. ఈ ఇఒలు ఇరువురూ ఇక్కడ విధుల్లో ఉండగా పంచాయితీ నిధులు రూ.97,61,199 దుర్వినియోగానికి పాల్పడినట్లు అధికారుల విచారణలో నిర్ధారణ అయినట్లు కమిషనర్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరు ఇఒగా పనిచేసిన సమయంలో అప్పటి సర్పంచ్ హబీబ్ బాషాతో లాలూచీపడి ప్రసాద్ రూ.43,25,379, ఇన్‌ఛార్జి సర్పంచ్ జీనత్ షఫీతో కుమ్మక్కై గఫూర్ రూ.54,35,820 నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు అన్నమయ్య జిల్లా కలెక్టర్ అందించిన విచారణ నివేదికలో తేలిందని కమిషనర్ స్పష్టం చేశారు. కలెక్టర్ నివేదిక మేరకు వారిద్దరినీ సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదివరకే ఈ వ్యవహారంలో గతంలో పీలేరు ఇఒగా పనిచేసిన కెఆర్ ప్రసాద్ (వాల్మీకిపురం గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంటు)ను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. పీలేరు పంచాయతీ నిధుల దుర్వినియోగం వ్యవహారంలో ఇప్పటివరకు ముగ్గురు అధికారులు బలయ్యారు. పీలేరు పంచాయతీ వ్యవహారంపై విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి జిల్లా అధికారులను కోరారు. ఆయన అభ్యర్థనతోపాటు సెలవులో ఉన్న సర్పంచ్ హబీబ్ బాషా కూడా ఇదే అంశంపై అప్పటి డిపిఒ ధనలక్ష్మిని కోరి వినతి పత్రం అందించడంతో అధికారులు విచారణకు పూనుకున్నారు. మదనపల్లె డిఎల్‌పిఒ నాగరాజు నేతృత్వంలో ఐదుగురు అధికారుల బృందాన్ని ఏర్పాటు చేసి 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు జరిగిన నిధుల వినియోగంపై ఈ ఏడాది జూన్ మాసంలో విచారణ జరిగింది. ఆ అధికారుల విచారణలో నిధులు దుర్వినియోగానికి గురైనట్లు నిర్ధారించి అప్పటి సర్పంచులు, ఇఒలకు జిల్లా ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో సర్పంచ్‌లకు చెక్ పవర్ రద్దు చేయడమే కాకుండా అధికారులపై శాఖాపరమైన చర్యలకు పూనుకున్నారు.

# రిజర్వాయర్లకు నిధులు మంజూరు చేయాలి

- రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

జలవనరుల శాఖా మంత్రి రామానాయుడుకు వినతిపత్రం ఇస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

ప్రజా శక్తి రాయచోటి
జిల్లాలో రైతులు, ప్రజలకు లబ్ధి చేకూరేలా పీలేరు మండలం, మండిపల్లె నాగిరెడ్డి శ్రీనివాసపురం రిజర్వాయర్, అడవిపల్లె రిజర్వాయర్‌లో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ మెయిన్ కెనాల్ బ్యాలెన్స్ పనులను పూర్తి చేసేందుకు రూ.156.60 కోట్లు మంజూరు చేయాలని శనివారం రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం విజయవాడలోని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు .ఈ సందర్భంగా మండిపల్లి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలోని రాయచోటి, సంబేపల్లి, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం ఈ ఆరు మండలాలలో ఉన్న చెరువుల మరమ్మతు పనులు, తాగునీటి సమస్య తదితర ఇరిగేషన్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ప్రధాన కాలువ పనులు పూర్తి చేసి అడవిపల్లె రిజర్వాయర్లకు నీళ్లు ఇవ్వాలన్నారు. రాబోయే రోజులలో నీటి నిల్వలు పెంపొందిస్తూ జిల్లాలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు ఇవ్వాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

## హెచ్‌ఎంలకు జిల్లా కేంద్రంలోనే శిక్షణ ఇవ్వాలి

ప్రజాశక్తి- రాయచోటి
ప్రధానోపాధ్యాయులకు అందించే లీడర్షిప్ ట్రైనింగ్‌లను జిల్లా కేంద్రంలోనే నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యంకు శనివారం సాయంత్రం ఉపాధ్యాయ సంఘాలు వినతి పత్రాన్ని అందించారు. ఇటీవల పశ్చిమగోదావరిలో లీడర్షిప్ ట్రైనింగ్‌లో ఒక ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మరణించారని పేర్కన్నారు. మరొకరు ఐసియులో అడ్మిట్ అయ్యారని పేర్కొన్నారు. ఆ సంఘటనలతో మన రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఇకపైన లీడర్షిప్ ట్రైనింగ్‌లన్ని జిల్లాల వారీగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఒకవేళ జిల్లా దాటి వెళ్లాల్సి వస్తే 100 కిలోమీటర్ల దూరం దాటకుండా చూస్తామని, శిక్షణను నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహిస్తామని చెప్పారని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు మరణిస్తున్నప్పటికీ ఇంతకు ముందు మాదిరే తిరిగి శిక్షణ ఇస్తామనడం దుర్మార్గమని వాపోయారు. జిల్లాలోని రాయచోటి, మదనపల్లి డివిజన్ ప్రధానోపాధ్యాయులకు ఈనెల 18 నుండి అనంతపురంలోని సెంటర్లోనే ట్రైనింగ్‌కి హాజరు కావాలని చెబుతున్నారన్నారు. జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు అందరికీ లీడర్షిప్ ట్రైనింగ్‌ను అన్నమయ్య జిల్లాలోనే ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు కొండూరు శ్రీనివాసరాజు, ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, మడితాటి నరసింహారెడ్డి, జె వెంకట్రాంరెడ్డి, ఎస్టియు జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, రామకృష్ణ, ఏపీటీఎఫ్ 257 జిల్లా అధ్యక్షులు అబ్బువరం హరిబాబు, అపస్ జిల్లా అధ్యక్షులు నరసింహులు, ఉపాధ్యాయులు కులశేఖర్ రెడ్డి, బచ్చల శ్రీనివాసులు, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సదాశివరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో 'సీమ'కు అన్యాయం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె : కూటమి అయిదు నెలల పాలనలో రాయలసీమకు 10 అన్యాయాలు, మోసాలు, ద్రోహాలు జరిగినట్లు పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సాంకేతిక శిక్షణా కేంద్రం తరలించడం అన్యాయమన్నారు. కొప్పర్తి పారిశ్రామికవాడలో ఉన్న ఎంఎస్‌ఎంఇ సాంకేతిక శిక్షణా కేంద్రాన్ని చంద్రబాబు ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబర్ 24న జీవో 56 ద్వారా అమరావతికి తరలించిందని చెప్పారు. పులివెందుల ప్రభుత్వ వైద్య కళా శాలకు జాతీయ మెడికల్ కమిషన్ ఈ ఏడాది ఆగష్టు 16న 50 ఎంబిబిఎస్ సీట్లు మంజూరు చేసిందని, వాటిని వద్దని ఈ ఏడాది సెప్టెంబర్ 10న చంద్ర బాబు ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందన్నారు. విభజన చట్టంలో షెడ్యూల్ 13 ప్రకారం కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం నిర్మించాల్సి ఉండగా దాని ఊసే లేదన్నారు. రాయలసీమకు అన్యాయం చేస్తే కూటమి పార్టీలను ప్రజలు తరిమి కొడతారని తులసిరెడ్డి పేర్కొన్నారు.

## గోల..గోల!

ప్రజాదృష్టి

సోషల్ మీడియాలో అనుచిత పోస్టుల వ్యవహారంపై రచ్చరచ్చ నడుస్తోంది. రాష్ట్రంలోని రాజకీయ ప్రముఖులపై వైసిపికి చెందిన సోషల్ మీడియా కార్యకర్తలు అనుచిత పోస్టులు పెట్టారనే పేరుతో పరిమితికి మించి వరుసగా కేసులు పెట్టుకుంటూ, అరెస్టుల చేసుకుంటూ పోవడం రాజకీయంగా నష్టపోయే ప్రమాదం పొంచి ఉందనే సంగతి గ్రహించాలి. మోస్తరు వరకు సరే, శృతి మించి రాగాన పడితేనే ప్రమాదం. అధికారం ఉందనే అహభావంతో ప్రత్యర్థులను వేటాడడం క్షంతవ్యం కాదు. 2019 సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి సర్కారు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యర్థులపై దాడుల పరంపర కొనసాగించిన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం దాని దుష్ఫలితాన్ని వైసిపి చవిచూసింది. ఇటువంటి అనుభవాలు కళ్లెదుటే ఉన్నప్పటికీ కూటమి నాయకత్వం సోషల్ మీడియాలో అనుచిత పోస్టుల వ్యవహారాన్ని హద్దు దాటకుండా చూసుకోవాలి. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ఇటువంటి దుష్ఫలితాన్ని చవిచూడాల్సి ఉంటుందని గ్రహించాలి. అధికారంలో చేతిలో ఉందనే ఉద్దేశంతో ప్రత్యర్థులే లక్ష్యంగా కేసుల పరంపరను కొనసాగించడం రాజకీయ అనారోగ్యమే అవుతుందని చెప్పవచ్చు. వైసిపి సర్కారు అధికారంలో ఉండడం వల్లే ఇష్టారీతిన పోస్టులు పెట్టారు. దాని దుష్ఫలితాన్ని అనుభవించారు. రాష్ట్రంలో కూటమి అధికారంలో ఉండడం వల్లే కేసులను కొనసాగిస్తే ప్రజల సానుభూతిని కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. సానుభూతి స్థానంలో ఆగ్రహాన్ని చవిచూసే అవకాశం ఉందని గ్రహించాలి. సోషల్ గోలకు ఫుల్‌స్టాప్ పెట్టి, ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన తల్లికివందనం, అన్నదాతా సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఫీజురీయింబర్స్‌మెంట్, సూపర్‌సిక్స్ పథకాల అమలు గురించి ఆలోచన చేయాలి. అటువంటి కసరత్తు చేయకుండా ప్రత్యర్థులను వేటాడటమే లక్ష్యంగా ముందు కెళ్తే ఎటువంటి ప్రయోజనమూ ఉండదు. విపరీత ధోరణుల కారణంగా ప్రజల సమస్యలు తాత్కాలికంగా తెరమరుగు కావొచ్చు. పాలక పార్టీలకు కొంతకాలం ఉపశమనం కలిగించవచ్చు. రాబోయే టర్మ్‌లో అధికారంలోకి వచ్చే పార్టీలు ఇటువంటి సంప్రదాయాన్ని కొనసాగిస్తే ప్రత్యర్థుల పరిస్థితేమిటో ఆలోచించుకోవాలి. ఏదేమైనా అధికారంలో ఉన్న నాయకత్వం హుందాగా వ్యవహరించాలి. గతంలో వేధింపులకు పాల్పడ్డారనే కారణంతో తామూ వేధింపులను కొనసాగిస్తామంటే చేసేదేమీ లేదు. కాకపోతే మీకు, వారికి ఉన్న తేడా ఏమిటో ఆలోచించాలి. దేనికైనా ఓ పరిమితి ఉంటుందని గ్రహించాలి. గత నెలలో తుఫాన్ బారిన పడిన రైతాంగం పెద్దఎత్తున నష్ట పోయింది. ఇటువంటి బాధిత రైతులను ఎలా ఆదుకోవాలనే అంశంపై ఆలోచన చేయాలి. రబీ సీజన్‌లో పత్తి పంటలో లద్దెపురుగు తెగులు సోకి అపారనష్టం వాటిల్లే అవకాశం ఉందనే ఆందోళన నెలకొంది. లద్దెపురుగు విజృంభణను ఎలా అరికట్టాలో తెలియక రైతాంగం తికమక పడుతోంది. జిల్లా వ్యవసాయశాఖ, కెవికె, ఇతర వ్యవసాయ శాస్త్రజ్ఞుల సలహాలను ఇప్పించే ప్రయత్నాలపై దృష్టి సారించాలి. తుపాన్ బారిన పడిన ఉల్లి రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారు. వారిని ఎలా ఆదుకోవాలనే అంశాలపై దృష్టి సారించాలి. రైతుల సమస్యలపై దృష్టి సారించకుండా ప్రత్యర్థులను ఎలా వేధించాలనే ఉద్దేశంతో సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టారనే కోణంలో ప్రత్యర్థులపై కేసులు పెట్టుకుంటూ పోవడం క్షంతవ్యం కాదనే సంగతిని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

\- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న చమర్తి

## నారా రామ్మూర్తి మృతి పార్టీకి తీరని లోటు

- టిడిపి జిల్లా అధ్యక్షులు 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరులు నారా రామ్మూర్తి నాయుడు మృతి చాలా బాధాకరమని, ఆయన మృతి టిడిపికి తీరని లోటని టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు అన్నారు. చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా తెలుగుదేశం పార్టీలో మంచి నాయకుడిగా ఎదిగిన రామ్మూర్తి నాయుడు మరణం నారా కుటుంబంతో పాటు టిడిపి కుటుంబానికి కూడా తీవ్రమైన బాధాకరమైన వార్తని, ఆయన మృతికి తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. శనివారం పార్లమెంట్ క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి వారి చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, మాజీ రాష్ట్ర డైరెక్టర్ గుల్జార్ బాష, కౌన్సిలర్ రాజేష్, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు, శవనవారిపల్లె సర్పంచ్ కోటయ్య నాయుడు, తెలుగు యువత పార్లమెంట్ అధికార ప్రతినిధులు పరశురాం నాయుడు పాల్గొన్నారు.

**రాయచోటి :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మరణంపై తీరని లోటని క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామ్మూర్తి నాయుడు 1994 నుంచి 1999 వరకు చంద్రగిరి శాసనసభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ విశేష సేవలు అందించారని గుర్తు చేశారు.

## క్షుద్రపూజలు నిర్వహించిన ఇద్దరు వైసిపి నేతలు అరెస్టు

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్
గుప్తనిధుల కోసం క్షుద్రపూజలు నిర్వహించిన ఇద్దరు వైసిపి నాయకులను శనివారం బి.కొత్తకోట పోలీసులు అరెస్టు చేశారు. మదనపల్లె చిన్నపిల్లల ఆస్పత్రి వైద్యుడు ఎ.వి.సుబ్బారెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన వజ్ర భాస్కర్‌రెడ్డి బి.కొత్తకోట మండలంలోని అటవీ ప్రాంతంలోని ఓ పురాతన దేవాలయం వద్ద పూజలు నిర్వహిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుప్తనిధుల కోసం పూజలు చేస్తున్నట్లు విచారణలో తేలడంతో అరెస్టు చేశామని డిఎస్‌పి కొండయ్య నాయుడు తెలిపారు. పురాతన దేవాలయం వద్ద పూజలు చేస్తుండడంతో అరెస్టు చేశామని, 41 నోటీసులిచ్చి పంపేసినట్లు తెలిపారు. గుప్త నిధులకోసం వైసిపి నాయకులు అరెస్టు అయ్యారన్న సమాచారం పట్టణంలో కలకలం రేగింది. సుబ్బారెడ్డి ప్రముఖ చిన్న పిల్లల వైద్యుడు కావడంతో అతని అరెస్టు ప్రాధాన్యత సంతరించుకుంది.

## 12 మందికి రూ.1.26 లక్షలు జరిమానా

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్ :** పట్టణ పరిధిలో ట్రాఫిక్ సిఐ చంద్ర శేఖర్ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 12 మంది పట్టుబడడం కలకలం రేపుతుంది. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసిన రాయచోటి ట్రాఫిక్ పోలీసులు నిందితులను కోర్టు ముందు హాజరు పరిచారు. దీంతో డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వారికి రాయచోటి కోర్టు భారీ జరిమానా విధించడంతో సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. రాయచోటి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ మద్యం తాగి వాహనాలు నడిపిన డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. 12 మందిపై కేసులు నమోదు చేసి రాయచోటి 2వతరగతి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి జిసి అసిఫా సుల్తానా ఒక్కొక్కరికి రూ.10500 వేలు చొప్పున మొత్తం రూ.1.26 లక్షలు జరిమానాను కోర్టు విధించింది. వాహనాదారులు మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# కడప ఎంపీ పిఎ రాఘవరెడ్డిపై సెర్చ్ వారెంట్

రాఘవరెడ్డి (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-పులివెందుల టౌన్
పులివెందుల నియోజకవర్గంలోని సామాజిక మాధ్యమాలలో అసభ్యకర పోస్టుల కేసుపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్.అవినాష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బండి రాఘవరెడ్డిపై పోలీసులు సెర్చ్ వారెంట్ నోటీసులను శుక్రవారం అర్ధరాత్రి లింగాల మండలం అంబకపల్లిలోని ఇంటికి అతికించారు. మరి కొంత మందికి 41ఎ నోటీసులను జారీ చేశారు. పులివెందులకు చెందిన వైసిపి సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ వివేకానందరెడ్డి 16వ తేదీ 10 గంటలకి పోలీసుస్టేషన్‌లో హాజరు కావాలని 41ఎ నోటీసులు ఆయన ఇంటికి పోలీసులు అంటించారు. బండి రాఘవరెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు ఈ నెల 10వ తేదీ నమోదైన విషయం తెలిసిందే. వైసిపి సామాజిక మాధ్యమాల కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డికి రాఘవరెడ్డి కంటెంట్ అందించే వారిని రవీంద్రారెడ్డి చెప్పినట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ కేసుల విషయంలో పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ నోటీసులు జారీ చేశారు.

**సోదాలకు పోలీసుల సన్నాహాలు :** వర్రా రవీంద్రా రెడ్డిపై కేసు నమోదైన వెంటనే అజ్ఞాతంలోనికి వెళ్లిపోయిన రాఘవరెడ్డిపై సెర్చ్ వారెంట్ డిఎస్‌పి మురళి నాయక్ జారీ చేయడంతో పట్టణ సిఐ జీవన్ గంగానాథ్ రాఘవరెడ్డిని పట్టుకోవడం కోసం అనుమానం వచ్చిన ఇళ్లల్లో సోదాలు చేయడానికి తన టీమ్‌ను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

**వారం రోజులు గడువు ఇవ్వండి : శ్వేత**
సామాజిక మాధ్యమాల అసభ్యకర పోస్టుల వ్యవహారంలో క్రైమ్ నెంబర్ 409/2024లో దాదాపు 45 మందిపైన కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి పులివెందులకు చెందిన వివేకానందరెడ్డికి శుక్రవారం అర్ధరాత్రి 41ఎ నోటీసులు ఇచ్చారు. శనివారం ఉదయం 10 గంటలకు డిఎస్‌పి కార్యాలయంలో రావాలని ఇచ్చారు. వివేకానందరెడ్డి పనినిమిత్తం బయటికి వెళ్లారని తన మొబైల్ ఫోన్ అందుబాటులో లేదని, వారం రోజులు గడువు ఇస్తే నేనే స్వయంగా హాజరు పరుస్తానని భార్య శ్వేత డిఎస్‌పికి లిఖితపూర్వకంగా లేఖ రాశారు. వైసిపి అడ్వకేట్ ఓబుల్‌రెడ్డి కూడా డిఎస్‌పికి లెటర్ రాశారు. ఈ కేసుకు సంబంధించి 41ఎ నోటీసులు ఎవరెవరికి ఇస్తున్నారో వారి వివరాలను తెలపాల్సిందిగా డిఎస్‌పిని కోరారు. వారి వివరాలను అందజేస్తే పది రోజుల్లో డిఎస్‌పి ఎదుట హాజరు పరుస్తామని అడ్వకేట్ తెలిపారు. డిఎస్‌పి ఉన్నతాధికారుల అనుమతితో వివరాలు వెల్లడిస్తానని ఓబుల్‌రెడ్డి చెప్పారు.


C.No. /SDPO/PDL/SEARCH/2024 Dated:15-11-2024
Search Proceedings U/s 105 BNSS
Pulivendula U/G PS Cr.No. 409/2024, u/s 386 IPC and 196, 351 (3), 353 (1) (c), 112 (2) (b) R/w 3 (5) BNS 2023 and Sec 3 (1) (r) (s), 3 (2) (v) (va) SC, ST (POA) Amendment Act - 2015 and 67 IT Act
Present: Sri. B. Murali, Sub Divisional Police officer, Pulivendula.
I, B. Murali, Sub Divisional Police Officer, Pulivendula hereby authorize Sri. Jeevan Ganganath Babu, Inspector of Police, Pulivendula U/G PS, to enter the house of Bandi Raghava Reddy, S/o Bandi Siva Reddy, H.No. 244-A, Ambkapalli, Lingala Mandal, YSR District, Cell No. 9000006243 with such force as may be deemed necessary to conduct a search of all persons and premises, including all parts of the location and to seize any evidence i.e., digital, document or any other evidence as well as any instruments found with the individuals or with in the premises reasonably suspected to have been used or intended to be used in the above case.
This authorization is given due to my inability to personally conduct the search at the premises mentioned above.
Given under my hand and seal of this office, this day on 15-11-2024.
Sub Divisional Police officer, Pulivendula.
Sub Divl. Police Officer PULIVENDULA.
Jeevan Ganganath Babu, Inspector of Police, Pulivendula U/G PS.
Inspector of Police PULIVENDULA(U) P.S. Y.S.R. Kadapa (Dist.)

ఎంపీ పిఎ రాఘవరెడ్డికి ఇంటికి పోలీసులు అంటించిన సెర్చ్‌వారెంట్

**న్యాయపరంగా పోరాడుతాం : కళ్యాణి**
**కడప అర్బన్ :** తన భర్త వర్రా రవీందర్‌రెడ్డిని పోలీసులు హింసించారని, ఈ నెల 8న అదుపులోనికి తీసుకుని 11న అరెస్టు చేసినట్లు డిఐజి చెప్పారని వర్రా భార్య కళ్యాణి పేర్కొన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తన భర్తను 11వ తేదీ అరెస్టు చేసినట్లు డిఐజి చెప్పారని, కోర్టు రిమాండ్ రిపోర్టులో కూడా ఇదే చెప్పారని తెలిపారు. ఇది పూర్తి అబద్ధమని, తన భర్తను ఈ నెల 8వ తేదీ కర్నూలు జిల్లా పుల్లూరు టోల్ ప్లాజా వద్ద కారులో వస్తుండగా పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. 8వ తేదీ అదుపులోకి తీసుకున్న పోలీసులు 12వ తేదీ జడ్జి ముందు హాజరు పరిచారని తెలిపారు. న్యాయపరంగా పోరాడుతామని తెలిపారు. న్యాయస్థానంపై పూర్తి నమ్మకం ఉందని పోరాడుతామని పేర్కొన్నారు.

బాలింతకు నగదును అందిస్తున్న వరలక్ష్మి

## బాలింతలకు నగదు అందజేత

**ప్రజాశక్తి-పుల్లంపేట**

పెనగలూరు ఎంపిడిఒ ప్రాంగణంలో ఐజీవిఎం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో రైల్వేకోడూరు టిడిపి ఇన్‌చార్జి, ఆడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి కొందరు గర్భిణులు, బాలింతల తల్లులకు ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున 16 మందికి 80 వేల రూపాయలు సహాయం చేస్తానని మాట ఇచ్చారు. ఆయన ఇచ్చినమాటని ఇప్పుడు ముక్కా ఫౌండేషన్ ద్వారా వారికి ఆర్థిక సాయాన్ని ఆయన సతీమణి వరలక్ష్మి శనివారం నగదు అందించారు. నగదు తీసుకున్న వారిలో సింగారెడ్డిపల్లి గ్రామం పూర్ణకుమారి, కంబాలకుంట కావ్య, ఆర్ అప్పారాజుపేట డి.ప్రశాంతి, నడింపల్లి శివాని, భవ్య శ్రీ, గోవిందం పల్లి గ్రామంలో ఏ రాజేశ్వరి, ఎం లక్ష్మీదేవి, వీరంవారిపల్లి ఆర్ పద్మకుమారి, ఆర్ లక్ష్మీ నరసమ్మ, బుట్టిరెడ్డి గారిపల్లి గ్రామంలో పావని, లత, ముద్దపల్లి గ్రామంలో టి.శాంతి, పి.సుకన్య, మల్లీశ్వరి, కంబాలగుంట బీసీ కాలనీ అనసూయ, ఇప్పారు గ్రామ షేక్ నవీన బేగంలు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ విజయరావు, ఎన్‌డిఎ కూటమి నాయకులు, మహిళా కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఎంఆర్‌పిఎస్ భవనం ప్రారంభం

**ప్రజాశక్తి-రామాపురం**

మండల కేంద్రమైన రామాపురంలో ఎంఆర్‌పిఎస్ కార్యాలయాన్ని శుక్రవారం ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి పెద్దపల్లి శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల హక్కుల కోసం మండల స్థాయిలో మాదిగల హక్కుల కోసం కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం హర్షణీయమని అన్నారు. మాదిగల హక్కుల కోసం ఎంఆర్‌పిఎస్ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో తెలుగు రెండు రాష్ట్రాల్లో పోరాటం చేస్తున్నారు. రెండు రాష్ట్రాల ముఖ్య మంత్రులు ఎస్‌సి వర్గీకరణ అమలు వరకు ఉద్యోగ భర్తీలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు చెన్నకేశవబాబు, ఆంజనేయులు, రమణయ్య, శంకర పాల్గొన్నారు.

బేకరిని సందర్శిస్తున్న విద్యార్థులు

## ఆహార సంరక్షణపై అవగాహన

**ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి**

ఆహార సంరక్షణ ఫుడ్ ప్రాసెసింగ్ పై అవగాహన నైపుణ్యం కలిగి ఉండాలని కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపల్ నాగలక్ష్మి పేర్కొన్నారు. శనివారం లక్కిరెడ్డిపల్లి వెంకటేశ్వర బేకరీలో విద్యార్థులకు సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో టైం సెంటర్ ఫర్ లర్నింగ్ లిమిటెడ్ వారి సౌజన్యంతో ఫుడ్ ప్రాసెసింగ్ పై వృత్తి విద్యా ఉపాధ్యాయులు వీర పద్మజ విద్యార్థులకు అవగాహన కల్పించారు. బేకరీలో తయారు చేయు పదార్థాలు, కేకులు వంటి వంటల తయారీలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను విద్యార్థులకు తెలియపరిచి వారిలోని నైపుణ్యాలతో వారికి మంచి అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోగిపై చిందులేసిన డాక్టర్

**- సూపరింటెండెంట్‌కు బాధితురాలు ఫిర్యాదు**

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలోని ఓ డాక్టర్ చికిత్స కోసం వచ్చిన రోగిపై చిందులేశాడు. బాధితురాలు సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు.. నిమ్మనపల్లె మండలం, చల్లావారిపల్లెకు చెందిన వెంకట లక్ష్మమ్మ (85) అనారోగ్యంతో తన బంధువు మాలతితో శనివారం మదనపల్లె సర్వజన భోధన ఆసుపత్రికి వచ్చింది. ఒపి చీటితో ఉదయం 9.40 గంటలకు 118వ ఒపిలో డాక్టర్ వద్దకు వెళుతుండగా రోగిని పరీక్షించాల్సిన డాక్టర్ వరప్రసాద్ బయటికి వెళ్లండంటూ కసురుకుని తరిమేశాడు. కొంచెం తలుపు మూసి అక్కడున్న ట్రైనీ విధ్యార్థినులకు గులాబి పువ్వు ఇచ్చి వారితో ముచ్చట్లలో మునిగిపోయాడు. ఇది చూసిన రోగి, సహాయకురాలు ఇందుకోసమా తమను బయటికి పంపిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వెంటనే మెడికల్ సూపరింటెండెంట్ గాయిత్రీ దేవికి ఫిర్యాదు చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ వరప్రసాద్‌ను పిలిచి విచారించి పంపించారు. సూపరింటెండెంట్ చాంబర్ నుండి బయటికి వచ్చిన డాక్టర్ పేషంట్ బంధువులతో వాగ్వివాదానికి దిగడంతో నువ్వు డాక్టర్రా రోమియోవా అని ప్రశ్నించడంతో అక్కడి నుండి జారుకున్నాడు. దీనిపై మెడికల్ సూపరింటెండెంట్ గాయిత్రీ దేవిని వివరణ కోరగా డాక్టర్‌ను మందలించామని, ఆసుపత్రిలో సిబ్బంది తక్కువగా ఉన్నా ఆసుపత్రిని నడుపుతున్నామని, సమస్యను పెద్దది చేయకుండా సహకరించాలని తెలిపారు. ఇలాంటి సంఘటనలు చాలా రోజులుగా జరుగుతున్నా ఏ ఒక్కరూ బయటికి చెప్పక పోవడంతో ఈ విషయం బయటికి పొక్కలేదు. శనివారం పేషంట్ సహాయకురాలు వారికి జరిగిన అవమానంపై ఫిర్యాదు చేయడంతో ఈ విషయాలు బయటికి వచ్చాయి. ఇప్పుడిప్పుడే ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల భావన మంచిగా మారుతున్న తరుణంలో ఇలాంటి డాక్టర్ల వల్ల మళ్లీ ప్రభుత్వాసుపత్రులు అంటే బయపడాల్సిన పరిస్థితి వచ్చే అవకాశం ఉంది. దీనిపై సంభందిత అధికారులు సదరు డాక్టర్‌పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## వైద్యం సరిగ్గా చేయలేదని ఆందోళన

**- ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బంధువుల డిమాండ్**

**ప్రజాశక్తి - రాయచోటి**

వైద్య సరిగ్గా చేయలేదని బాధితులు పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివరాలు... తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దమండ్యెం మండలం, పాపేపల్లి పంచాయతీ వెలిగింటవారిపల్లెకు చెందిన మల్లికార్జున గత నెల 17న కడపునొప్పితో బాధపడుతూ మల్టీస్పెషాల్టీ ఆస్పత్రిలో చేరారు. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి పేగుకు రంధ్రం పడిందని అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని అందుకు రూ. 50 వేలు చెల్లించాలని పేర్కొన్నారు. డబ్బులు కట్టిన అనంతరం అదేరోజు రాత్రి 2 గంటలకు ఆపరేషన్ చేసి విజయవంతం అయిందని వైద్యులు చెప్పారు. రెండు రోజులు వైద్యం చేసుకుని ఇంటికి పంపారు. తరువాత మళ్లీ కడుపు నొప్పి రావడంతో బంధువులు అతన్ని మరొక ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి పేగులో రంధ్రాలున్నాయని చెప్పడంతో తల్లిదండ్రులు అవక్కాయ్యారు. ఈఘటనపై శ్రీవెంకటేశ్వర ఆస్పత్రి యాజమాన్యం వెంకటేశ్వరరెడ్డితో మాట్లాడేందుకు బంధువులు ప్రయత్నించగా సిబ్బంది వారిని లోనికి రాకుండా బయటకు నెట్టివేశారు. బాధితులు చేసేదీమిలేక ఆస్పత్రి ఎదుట నిరసన తెలియజేశారు. ఆపరేషన్ సక్రమంగా చేయకపోవడంతో తమ బిడ్డకు మళ్లీ కడుపునొప్పి వచ్చిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఆస్పత్రి వైద్యులు డాక్టర్ వెంకటేశ్వరెడ్డి స్పందిస్తూ మల్లికార్జున తమ ఆస్పత్రిలో చేరినప్పుడు పరిస్థితి విషమంగా ఉందని, ఈ విషయం అతని తల్లిదండ్రులకు చెప్పామన్నారు. ఆపరేషన్ చేసి పేగులో ఉన్న రంధ్రానికి కుట్లు వేశామన్నారు. పేగుల్లో అల్సర్ ఉన్నాయని, వీటి వల్ల ప్రమాదం ఉందని, ఎంఆర్ స్కానింగ్ తీయాలని, తిరుపతి రుయా ఆస్పత్రికి తీసుకెళ్లండి అని బంధువులకు చెప్పామని ఆయన పేర్కొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయండి : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశించారు. శనివారం పెద్దమండ్యం మండల పర్యటనలో భాగంగా ఎంపిడిఒ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో మండల అభివృద్ధిపై చర్చించారు. మండల పరిధిలోని చెరువుకిందపల్లిలో షుగర్ వ్యాధి తో బాధపడుతున్న మల్లయ్య అనే వ్యక్తికి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. వైద్య ఖర్చులు కూడా భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి, సంక్షేమానికి అధికారులు చొరవ చూపాలన్నారు. సంక్షేమ పథకా లను ప్రజలందరికీ పారదర్శకంగా అందించాలన్నారు. సిఎం చంద్రబాబు లాంటి అబద్దాల కోరుపి దేశంలో ఎక్కడా చూడలేదన్నారు. మాట తప్పడం అతని నైజమని, ప్రశ్నిస్తే తట్టుకోలేకపోవడం ఆయన సహజ లక్షణమని విమర్శిం చారు. అన్ని వర్గాల ప్రజ లను మోసం చేసిన చంద్రబాబు ప్రజాకోర్టులో శిక్షకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల ముఖ్య వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

ఆరోగ్యం సరిగాలేని వ్యక్తికి ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

# 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎంపిడిఒకు సమ్మె నోటీసు అందిస్తున్న 108 ఉద్యోగులు

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

అత్యవసర సేవలు అందిస్తున్న 108 అంబులెన్స్ ఉద్యోగులు సమ్మె సైరన్ మోగిస్తున్నారు. శనివారం నిమ్మనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో విధులు నిర్వహిస్తున్న 108 అంబులెన్స్ ఉద్యోగులు అమరనారాయణ, రెడ్డి జస్వంత్, సద్దాం హుస్సేన్, వాణి కలసి సమ్మె నోటీసులను ఎంపిడిఒ పరమే శ్వర్‌రెడ్డికి, స్థానిక ఎఎస్‌ఐ జిల్లాబాషాకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యూడిసి అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబ భారాన్ని మోయలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉద్యోగులకు పని ఒత్తిడి, ఉద్యోగ భద్రత, జిఒ నెంబరు 49 అమలు తదితర సమస్యలు దీర్ఘకాలంగా వెంటాడుతున్నాయని అన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించుకుంటే ఈ నెల 25 నుంచి నుంచి ఆందోళనలు చేపడతామన్నారు. 108 సర్వీస్ లోని ఉద్యోగులను వైద్య ఆరోగ్యశాఖ ఉద్యో గులుగా గుర్తించి ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ప్రతి నెల 5వ తేదీ లోపు జీతాల చెల్లింపులు జరగాలని, 8 గంటల పని చేసేలా షిఫ్టుల పద్ధతిని అమలు చేయాని కోరారు. జీతంపై 40 శాతం ఇంక్రిమెంటును అందించాలని, అరి యర్స్‌ను కలిపి వేతనంతో జమచేయాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖలో చేపట్టే నియామకాల్లో సర్వీస్‌కు అనుగుణంగా వెయిటేజ్ మార్కులు అందించాలన్నారు. విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి మరణించిన తర్వాత బాధ్యత కుటుంబానికి ఎక్స్ గ్రేషియా రూ.20 లక్షలు ఇవ్వాలన్నారు. ప్రతి మండల కేంద్రంలోనూ కనీస అవసరాలతో కూడిన శాశ్వత భవనాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. తమ న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించుకుంటే ఈనెల 25వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 108 ఉద్యోగుల రాష్ట్ర యూనియన్ మేరకు ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు అమర నారాయణ, రెడ్డి జస్వంత్, సద్దాం హుస్సేన్, వాణి పాల్గొన్నారు.

# గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుకోవాలి

**ప్రజాశక్తి-రాయచోటి**

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగా రాలని ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. శనివారం ఉదయం సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను గ్రంథాలయ అధికారి రెడ్డిశేఖర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జీవన వికాసానికి, సామాజిక పురోగతికి సోపానాలు గ్రంథాలయా లన్నారు. యువ కులు, విద్యావంతులు, విద్యార్థులు అందుబాటులో ఉన్న గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించుకోవడంతోపాటు డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖనం క్విజ్, క్రీడా పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమం నందు పాల్గొని గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాఠశాల గణిత ఉపాధ్యాయులు దేవ ప్రసాద్ రెడ్డి, పిఎం.బాషా, విజయ భాస్కర్, రవిశంకర్, ఉమాదేవి పాల్గొన్నారు. **రామాపురం :** వ్యాస రచన, వకృతపు పోటీలలో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో మేథోశక్తి విజ్ఞానాన్ని పెంపొందిం చుకోవచ్చునని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ గతంలో సెల్‌ఫోన్ రాని సమయంలో గ్రంథాలయాలను విరివిగా ఉపయోగించుకొని ఉన్నత చదువులు చదివి పదవులు పొందారని అన్నారు. కార్యక్రమంలో స్థానిక గ్రంథా లయ అధికారి సూర్యనారాయణరెడ్డి, స్థానిక వెంకటేశ్వర హైస్కూల్ కరస్పాండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్, వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు. **రైల్వేకోడూరు:** గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, ఐఎన్‌జి వెంకటరమణయ్యకు బాలిక పాఠశాల ఉపాధ్యాయులు దశరథ చే పూల మాలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బాలిక ఉన్నత పాఠశాల విద్యా ర్థులు పాల్గొన్నారు. **కలికిరి:** గ్రంథాలయాలు విద్యార్థుల జీవిత గమ్యాన్ని మార్చే మార్గదర్శకాలు అని ఎంఇఒ కరిముల్లా అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయం నందు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయాల అభివృద్ధికి తోడ్పడిన ప్రముఖ వ్యక్తులను స్మరించుకునే కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ కరీముల్లా విచ్చేసి ఆంధ్ర ప్రదేశ్ గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, తెలుగు, బోటనీ అధ్యాపకులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుకోవడం మన బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సిటిఎం రోడ్‌లో గల ప్రధాన శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మూడో రోజు గ్రంథాలయ అధ్యయన పరిశోధకులు డాక్టర్ నారాయణ మూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలకత్తాలో జాతీయ, అమెరికాలో విశ్వస్థాయి, దక్షిణ భారత దేశంలో కన్నా పెద్ద గ్రంథాలయం చెన్నైలో కలదన్నారు. ప్రభుత్వ పూర్వపు పాలిటెక్నిక్ కాలేజ్ గ్రంథాలయ అధికారి జనార్దన్ రెడ్డి మాట్లా డుతూ తాను ఇదివరకే పిల్లలకు సభ్యత్వం కట్టానని, ఇక మీదట కూడా పేద పిల్లలుంటే సభ్యత్వం కడతానన్నారు. బి.టి.కళాశాలపూర్వపు కరస్పాండెంట్ మునిరత్నం మాట్లా డుతూ కేవలం గ్రంథాలయాల వల్లనే తాను ప్రిన్సిపాల్ స్థాయి వరకు వెళ్లానన్నారు. అధ్యక్షులుగా ప్రముఖ కథా నవలా రచయిత టిఎస్ఎ కృష్ణమూర్తి కార్యక్రమాన్ని నడిపించారు. కార్యక్రమంలో గొల్లపూడి తిరుపతిరావు, లింగాల యుగంధరాచారి, విశ్రాంత ఉపాధ్యా యులు రెడ్డెప్ప, గ్రంథాలయ అధికారి వసంతకుమారి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జడ్‌పి హైస్కూల్‌లో ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణ గురించి వివరించారు. ఎనిమిది, తొమ్మిది, పదవ తరగతి విద్యార్థులకు గ్రంథాలయ వాటి ఆవశ్యకత గురించి వ్యాసరచన పోటీలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాసులు, చైర్మన్ శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

### గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు వితరణ

**పీలేరు :** పీలేరు శాఖా గ్రంథాలయానికి ఎస్ఎల్‌వి బుక్‌స్టాల్ యజమాని లోకా సంజీవయ్య, లోకా లోకనాథం సోదరులు పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను వితరణ చేశారు. 75వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ కారుల సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమానికి కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోడెం చెంగల్ రాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రంథాలయ ఉద్యమకారులు ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్రం ఉద్యమ విజయంలో గ్రంథాలయాలు బాగా ఉపయోగ పడ్డాయని అన్నారు. గ్రంథాలయాల ఉద్యమకారులు ఎస్ఆర్ రంగనాథం, పాతూరు నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్య, మాడపాటి హను మంతరావు సేవలు అపారం, అపూర్వమని, వారు గ్రంథాలయాల అభివృద్ధికి చేసిన సేవలు వెలకట్టలేనివని చెప్పారు.

# కన్యమడుగు సంఘమిత్రను మార్పుచేయాలి

**- రోడ్డుపై బైఠాయించి సంఘ సభ్యుల నిరసన**

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి**

మండలంలోని కన్యమడుగు విఒ సంఘమిత్ర నియామకాన్ని గతంలో వెలుగు అధికా రులు సభ్యులకు తెలియకుండా నిబంధనలకు విరుద్ధంగా ఎంపిక చేశారని మహిళా సంఘ సభ్యులు ఆరోపించారు. ఈ విషయాన్ని కలెక్టర్, వెలుగు పీడీ సత్యనారాయణలకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్, పీడీ ఆదేశాల మేరకు బిపి ఐవి వేణుమాధవ్, బిపిఎం లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, ఎపిఎం గంగాధర్ మండల సమైక్య అధ్యక్షురాలు రామ లక్ష్మి, కార్యదర్శి నోజియా సమక్షంలో విచారణ జరిపారు. మహిళా సంఘ సభ్యులు మూకుమ్మడిగా సంఘమిత్రను మార్పు చేయాలని నిబంధనల మేరకు సంఘమిత్రల ఎంపిక నిర్వహిం చాలని పట్టుబట్టారు. స్పందించిన విచారణ అధికారులు డిసెంబర్ 3న జరిగే విఒ సమావేశంలో సభ్యులందరి ఆమోదం మేరకే సంఘమిత్ర ఎంపిక నిర్వహిస్తామని తెలిపారు. ఆగ్రహించిన మహిళలు వెంటనే మార్పు చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ లోకేష్‌రెడ్డి నిరసన కారులతో చర్చించి ఆందోళనను విరమింపజేశారు.


నిరసన వ్యక్తం చేస్తున్న సంఘ సభ్యులు


విచారణ చేస్తున్న ఐవి,బిపిఎం,ఎపిఎం

## ఖాతాదారులకు మెరుగైన సేవలు

**ప్రజాశక్తి - సింహాద్రిపురం:** ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ సింహాద్రిపురం బ్రాంచ్ మేనేజర్ కృష్ణకిషోర్ పేర్కొ న్నారు. శనివారం మండలంలోని నిడివెలగల కస్తూర్బా పాఠశాలలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో నాబార్డ్ వారి సౌజన్యంతో ఆర్థిక అక్షరా స్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ ఖాతాదారులకు విరివిగా రుణాలు అందించి, వారి అభ్యున్నతికి తోడ్పడుతామన్నారు. తమ బ్యాంకులో సీనియర్ సిటిజన్స్‌కు డిపాజిట్లపై అత్య ధిక వడ్డీ ఇవ్వనున్నట్లు తెలిపారు. విఎంఆర్ రూరల్ అవేర్నెస్ ఫోక్ ఆర్ట్ ఆర్గనై జేషన్ కళాజాత బృందం ఆధ్వర్యంలో బ్యాంకులో రుణాలు పొం దడం, డిపా జిట్లపై పాటల, మ్యాజిక్ షోతో చాలా చక్కగా ప్రజలకు వివరిం చారు. కార్యక్ర మంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ మధుసూదన్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## దోమ లార్వా నిర్మూలనకు చర్యలు

**ప్రజాశక్తి - ముద్దనూరు** :పెద్ద కాలువలో ఉన్న దోమ లార్వా నిర్మూలనకు గంబూజియా చేప పిల్లలను వదిలినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మయ్య తెలిపారు. స్థానిక ఎస్వీ గిరి కాలనీ వద్ద ఉన్న కాలువలో శనివారం పిహెచ్‌సి వైద్యాధికారి కరిష్మా ఆధ్వర్యంలో దోమ లార్వా నిర్మూలనకు గంబూజియా చేప పిల్లలను వదిలారు. కాలనీలో జ్వరాల కేసులు నమోదు కావడంతో చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం వివరాలను తెలుసుకుంటున్న డిఎల్‌పిఒ నాగరాజు

## పారిశుధ్యంపై దృష్టి సారించండి : డిఎల్‌పిఒ

**ప్రజాశక్తి కలికిరి**

కలికిరి పంచాయతీ పారిశుధ్యంపై దృష్టి సారించాలని డిఎల్‌పిఒ నాగరాజు పంచాయితీ అధికా రులను ఆదేశించారు. శనివారం కలికిరి మేజర్ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించి గ్రామంలో పారిశుధ్యంపై దృష్టి సారించాలని తెలిపారు. వీధి దీపాలు, మురికినీటి కాలువలు, చెత్త సేకరణ, మంచినీటి కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కలికిరి వీధుల్లో నూతన విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఎక్కడ సమస్యలున్నా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఈ సందర్భంగా అధికారులకు తెలియజేసారు. కార్యక్రమంలో పంచాయతీ ఇఒ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.


తంబళ్లపల్లి: మాట్లాడుతున్న ఎంపిడిఒ ఉపేంద్రారెడ్డి

## గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి**

స్థానిక ఎంపిపి కార్యాలయంలో శనివారం గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపిడిఒ ఉపేంద్రారెడ్డి, ఇఒపిఆర్‌డి దిలీప్‌కుమార్‌లు 2025-26 ఆర్థిక సంవత్సరానికి అభివృద్ధి ప్రణాళిక తయారు తీరుపై శిక్షణ ఇచ్చారు. గ్రామ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు సంఘ మిత్రులకు ప్రణాళిక రూపొందించడంపై అవగాహన కల్పించారు. అందరూ సమిష్టిగా కృషి చేసి ప్రజల అవసరాలను గుర్తించి ప్రణాళిక రూపొందించా లన్నారు. **పీలేరు:** 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని మదనపల్లె డిఎల్‌పిఒ నాగరాజ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసి, పంచాయతీ కార్యదర్శులకు, గ్రామ సచివాలయ సభ్యులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సామాజిక అవసరాలను గుర్తించి ఆ పనులకు సంబంధించి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసి మండల కార్యాలయానికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శివశంకర్, వైస్ ఎంపిపి ఎన్.వి. చలపతి, ఇఒపిఆర్‌డి లతీఫ్ ఖాన్, పిఆర్‌జెఇ రామకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

## మాజీ సైనికుల భూమిలో నిర్మాణాలను తొలగించండి

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

ఆక్రమణలో ఉన్న మాజీ సైనికుల భూమి లో నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ శనివారం మాజీ సైనికులు తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మదనపల్లె డివిజన్ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివా సులు నాయుడు మాట్లా డుతూ మదనపల్లె మండలం, బండమీద కమ్మపల్లి గ్రామం, సర్వే నెం. 8/1లో అమ్మచెరువు మిట్టవద్ద ఉన్న 3 ఎకరాల నీటివనరులతో ఉన్న భూమి చట్టప్రకారం నిషేదిత భూమి. ఇందులో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదంటూ మదనపల్లె డివిజన్‌లోని 142 మాజీ సైనికులకు, 1995లో ప్రభుత్వం ట్రూసీ పట్టాలు ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ భూమిలో ఉన్న చెట్ల ఫలసాయం మాత్రమే అనుభవించు కోవచ్చు. మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, 2016లో ఇంద్రసేన రాజు అనే మాజీ సైనికుని పేరుతో నకిలీ పట్టా సృష్టించారని తెలిపారు. తదనంతరం సదరు భూమిని దొమ్మలపాటి రమేష్ పేరున, భార్య సరళ పేరున రిజిస్టర్ చేసుకొన్నారని చెప్పారు. మాజీ సైనికులు ఏడాదిన్నర క్రితం మంగళగిరిలోని సిసిఎల్‌ఎ కోర్టుకు వెళ్లారని తెలిపారు. పరిశీలించిన కోర్టు నకిలీ పట్టా సృష్టించిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, నిర్మాణాలను తొలగించాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. రెవెన్యూ స్పందించక పోవడంతో అక్రమ నిర్మాణాలు ఆగ లేదని వాపోయారని తెలిపారు. కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే ఆక్రమణలను తొలగించి మాజీ సైనికులకు భూమిని అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సైనికులు భాస్కర్‌రెడ్డి, వెంకటస్వామి, నాగరాజ, ఎంవి రెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

నిరసన చేస్తున్న మాజీ సైనికులు

# క్రైం కార్నర్

## మనస్తాపంతో యువకుడి ఆత్మహత్యాయత్నం

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

అవసరం నిమిత్తం అప్పిచ్చిన మహిళ నలుగురులో తన పరువు తీసిందని ఓ యువకుడు పురుగులమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. బాధితుడి కథనం మేరకు.. ఇసు కనూతిపల్లెకు చెందిన శ్రీనివాసులు అదే ప్రాంతానికి చెందిన తనకు సన్నిహితంగా ఉన్న ఓ మహిళ వద్ద అవసరాల కోసం కొంత నగదును అప్పుగా తీసుకున్నాడు. ఆ నగదును సకాలంలో తిరిగి ఇవ్వకపోవడంతో ఆ మహిళ నలుగురులో అవమానకరంగా మాట్లాడి పరువు తీసింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీనివాసులు పురుగులమందు తాగి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు బాధితున్ని మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సిఐ కళా వెంకటరమణ తెలిపారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**ప్రజాశక్తి-పుల్లంపేట**

మండల పరిధిలోని కడప-చెన్నై జాతీయ రహదారి అప్పయ్య రాజుపేట గ్రామంలో రోడ్డు క్రాస్ నుంచి రైల్వే గేట్ వద్దకు నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొ నడంతో మృతి చెందాడని ఎస్ఐ మోహన్ కుమార్‌గౌడ్ తెలిపారు. మృతి చెందిన వ్యక్తి నూకన పల్లి గ్రామానికి చెందిన కల్లూరు వెంకటరమణ(48) అలియాస్ చిరంజీవిగా గుర్తించామని చెప్పారు. ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బైక్ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన శనివారం మదనపల్లె మండలం లో జరిగింది. మదనపల్లె మండలం, కోళ్లబైలు రోడ్డు, నీరుగట్టువారిపల్లె సమీపంలో గుర్తు తెలియని బైక్ వేగంగా వచ్చి రోడ్డు పక్కన నిలబడి ఉన్న వృద్ధుడు మోడెం పెద్దన్న ఢీకొట్టి వెళ్లిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాధితుడిని స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విష మంగా ఉండడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సిఐ కళా వెంకటరమణ తెలిపారు.